
సాక్షి ఒడిశా

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,60,367లు, బంగారం 12 గ్రాముల 650 మిల్లీగ్రాములు వెండి 97గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చైతీ ఉత్సవాలు

మునిగుడలో సమితిస్థాయి చైతీ ఉత్సవాలు జరిగాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో



శ్రామిక్ కాంగ్రెస్ విజయం

రైల్వే సంఘాల ఎన్నికల్లో శ్రామిక్ కాంగ్రెస్ విజయం సాధించింది. గురువారం ఫలితాలు వెల్లడయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

పేదలకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న రాజు

రాయగడ: స్థానిక డీఎస్‌ఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు రగ్గుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు యువ సమాజ సేవకుడు ధర్మాన రాజు గత మూడు రోజులుగా బస్టాండ్, రైల్వేస్టేషన్, మందిరాల వద్దనున్న నిరుపేదలను గుర్తించి 300 రగ్గులను పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా ఈ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిల్ పోటీలు



ట్రైసైకిల్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

రాయగడ: చైతీ క్రీడోత్సవాల్లో భాగంగా గురువారం దివ్యాంగుల మధ్య ట్రై సైకిల్ పోటీలను జిల్లా యంత్రాంగం నిర్వహించింది. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ పోటీల్లో ఉత్సాహంగా దివ్యాంగులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి పోటీలను ప్రారంభించగా, సుమారు కిలోమీటరు దూరం వరకు వెళ్లి రావాల్సిందిగా నియమాలను విధించారు. ఈ పోటీల్లో సంపాణి నీలకంఠ ప్రథమ బహుమతి, గౌతం గంట ద్వితీయ, సంజయ్ సేనాపతి తృతీయ స్థానాన్ని పొందారు. కురా సాహు, రాజీవ్ సింగ్, శంకర్ మాఝిలు ప్రోత్సాహక బహుమతులను గెలిపొందారు. విజేతలకు ఈనెల 26వ తేదీన స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చైతీ ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తారు.

ట్రాక్టరు, ట్రక్కు ఢీ



మంటల్లో దగ్ధమవుతున్న వాహనాలు

భువనేశ్వర్: ట్రాక్టరు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఒక బైక్ కూడా మంటల్లో కాలిపోయింది. మృతుడిని నువాగాంవ్ గ్రామస్తుడు పప్పూ మహంతిగా గుర్తించారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన బుధవారం అర్ధరాత్రి మయూర్‌భంజ్ జిల్లా 49వ నంబరు జాతీయ రహదారి దుమురిడిహా కూడలి సమీపంలో చోటు చేసుకుంది. ఉల్లి గడ్డలు రవాణా చేస్తున్న ట్రక్కు, ట్రాక్టరు ముఖాముఖీ ఢీకొన్నాయి. ట్రక్కు బోల్తా పడింది. దీంతో మంటలు రగిలాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టరులో ఉన్న కారిృకుడు దుర్మరణం పాలయ్యాడు. ట్రక్కు డ్రైవరు, హెల్పర్ తీవ్రంగా గాయపడ్డారు. బిషోయి ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కొరాపుట్ జిల్లా పంచాయతీ రాజ్‌కి రాష్ట్రపతి పురస్కారం



భారత రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పరిషత్‌కి రాష్ట్రపతి పంచాయతీ రాజ్ పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డుని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, కలెక్టర్ వి.కీర్తి వాసన్‌లకు అందజేశారు. నానాజీ దేశ్ ముఖ్ సర్వోత్తమ పంచాయతీ రాష్ట్ర వికాస్ పురస్కార్ అవార్డులో కొరాపుట్ జిల్లాకి దేశంలోనే రెండోస్థానం దక్కింది. ఈ అవార్డు కింద రు.3 కోట్ల నగదు పురస్కారం అందజేశారు.

రైల్వేస్టేషన్లలో .. జగన్నాథుడి ప్రసాదం

- పూరీ ఎంపీ సంబిత్ పాత్రో ప్రతిపాదన



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ సంబిత్ పాత్రో

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ స్వామివారి ప్రసాదం రైల్వేస్టేషన్ల ప్లాట్‌ఫారాలపై అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం చొరవ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా పూరీ లోక్‌సభ సభ్యుడు, భారతీయ జనతా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రో భారత పార్లమెంటులో ఈ ప్రతిపాదన చేశారు. ప్రధాన రైల్వేస్టేషన్లలో శ్రీమందిర్‌లో స్వామివారికి నివేదించిన మహా ప్రసాదం (ఒబొఢా) అందుబాటులోకి తీసుకు రావాలని ప్రతిపాదించారు. ఈ మేరకు రైల్వే శాఖ ముందుకు రావాలని అభ్యర్థించారు. పలు ప్రాంతాల నుంచి పర్యటించే ప్రయాణికులకు రైల్వే ప్లాట్‌ఫారాలపై స్వామి పొడి మహా ప్రసాదం కొనుగోలుకు అందుబాటులోకి తేవడం సుసాధ్యమేనని సభలో వివరించారు.

అన్నివర్గాల సమన్వయంతో..

శ్రీ జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ), సేవాయత్ వర్గాలు, పూరీ గజపతి మహారాజా, ముక్తి మండపం ప్రముఖులు వంటి శ్రీ మందిరం అనుబంధ ప్రముఖ వర్గాల సంప్రదింపులు, సమన్వయంతో రైల్వే ప్లాట్‌ఫారాలపై స్వామి పొడి మహా ప్రసాదం అందుబాటులోకి తీసుకొస్తే అశేష భక్తజనం ఆనందిస్తారని ఎంపీ పేర్కొన్నారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను సమీక్షించడంలో రైల్వే శాఖ ప్రత్యేకంగా చొరవ కల్పించుకోవాలని విభాగం మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సూచించారు. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ రైల్వే స్టేషను ప్లాట్‌ఫారాలపై శ్రీ జగన్నాథుని పొడి మహా ప్రసాదం అందుబాటులోకి తీసుకొస్తే వాస్తవ కార్యాచరణ అమలు సాధ్యాసాధ్యాలు స్పష్టం అవుతాయన్నారు. అనంతరం అంచెలంచెలుగా ఈ సదుపాయం విస్తరణకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. తొలి దశ ప్రయత్నం ఫలిస్తే ఒడిశా మీదుగా వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే ఈ ప్రతిపాదన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర పంచాయతీలకు జాతీయ పురస్కారం



గంజాం జిల్లా జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న పంచాయతీ ప్రతినిధులు



రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న సుందరగడ్ జిల్లా పంచాయతీ ప్రతినిధులు

భువనేశ్వర్: పంచాయతీ వ్యవస్థలో రాష్ట్రం జాతీయ స్థాయి పురస్కారాలు గెలుచుకోవడం విశేషం. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పంచాయతీ వ్యవస్థ అధికారులు, ప్రతినిధులు ఈ పురస్కారాలు అందుకోవడం అభినందనీయమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. జాతీయ స్థాయిలో 45 మందికి ఈ పురస్కారాలు లభించగా రాష్ట్రం 7 విభాగాల్లో జాతీయ పురస్కారాల్ని అందుకుందన్నారు. గంజాం, కొరాపుట్, సుందరగ్ జిల్లాలు జాతీయ స్థాయి పంచాయితీ అవార్డుల్ని గెలుచుకున్నాయి. గంజాం జిల్లా అత్యధికంగా 3, సుందరగడ్ 2, కొరాపుట్ ఒక విభాగంలో జాతీయ స్థాయి అవార్డుల్ని పొందాయి. గంజాం జిల్లా రొంగైలుండా మండలం కెలువాపల్లి, హింజిలికాటు మండలం షాహాపూర్, ఛత్రపురం మండలం, సుందరగడ్ జిల్లా కొయిడా మండలం కసీరా గ్రామ పంచాయతీ, బొణైగడ్ మండలం కెంద్రికిలా గ్రామ పంచాయతీలు జాతీయ పురస్కారాలు అందుకున్నాయి.

వరి కొనుగోలుపై ముఖ్యమంత్రి సమీక్ష



వరి కొనుగోలు ప్రక్రియ సమీక్షించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియ తాజా స్థితిగతుల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సమీక్షించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్ సేవా భవన్‌లో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్, వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. వరి కొనుగోలును పురస్కరించుకుని రైతులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అనుబంధ యంత్రాంగం పూర్తి జాగ్రత్త తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. ఆకస్మికంగా తలెత్తే సమస్యల తక్షణ పరిష్కారంపై యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండీల పరిసరాల్లో రైతుల సదుపాయం కోసం క్యాంటీన్, తాగు నీరు, మరుగు దొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

మల్కన్‌గిరి జిల్లా మోము ప్రాంతంలో ఎన్‌ఐఏ దాడులు



దేవిడ్ ఇంటి వద్ద సోదాలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు పోలీసు స్టేషన్ పరిధిలో గల అనంతపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఐఏ బృందం జిల్లా బీఎస్‌ఎఫ్, డీవీఎఫ్ సాయంతో దాడులు చేశారు. ముందుగా గ్రామంలో చెరువులో చేపలు పడుతున్న దేవిడ్ నక్క అనే వ్యక్తికి అదుపులోకి తీసుకున్నారు. దేవిడ్ మావోయిస్టులకు జిలెటిన్ స్టిక్స్ అందిస్తున్నట్లు తెలిసింది. దీంతో అతని ఇంటిలో సోదా చేశారు. అలాగే మల్కన్‌గిరి జిల్లాకు సరిహద్దున ఉన్న సుకుమలో కూడా రెండు చోట్ల ఎన్‌ఐఏ దాడులు జరుగుతున్నాయి.

శ్రీజగన్నాథుని దర్శనం సులభతరం



ఓబీసీసీ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- త్వరలో 6 వరుసల ర్యాంప్ సౌకర్యం
- దివ్యాంగులు, వయో వృద్ధులకు ప్రత్యేకం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువై ఉన్న శ్రీజగన్నాథుని దర్శనం సులభతరం కానుంది. ప్రధానంగా దివ్యాంగులు, వయో వృద్ధులకు సౌకర్యవంతమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలనే యోచన బలపడుతోంది. శ్రీమందిరంలోని రత్న వేదిక ఆవరణ వరకు ప్రత్యేకమైన ర్యాంప్‌లతో దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యం ప్రతిపాదించారు. దీనిని 6 వరుసల్లో ఏర్పాటు చేస్తారు. అవాంతరాలు లేని దర్శనం ఈ వర్గాలకు కల్పించాలనే దృక్పథంతో ఈ యోచన కార్యరూపం దాల్చే దిశలో సన్నాహాలు చేస్తున్నట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏవో) డాక్టర్ అరవింద కుమార్ పాఢి గురువారం తెలిపారు.

ఓబీసీసీతో సమావేశం

భక్తులు, యాత్రికులకు సులభ దర్శనం నేపథ్యంలో పలు ఏర్పాట్లు కోసం శ్రీమందిరం అధికార వర్గం ఒడిశా వంతెన నిర్మాణ కార్పొరేషన్(ఓబీసీసీ) అధికార వర్గాలతో గురువారం సమావేశం అయింది. ఈ సమావేశానికి ఛత్తీషా నియోగుల సంఘం ప్రముఖులు హాజరు కావడం విశేషం. నియోగుల వర్గం ఈ యోచనపై అంగీకారం ప్రకటించింది. ఈ వర్గం సూచన మేరకు జగన్నాథ దేవాలయం నాట్య మండపం ఆవరణలో 6 వరుసల ర్యాంప్ ఏర్పాటు చేయాలని లాంచనంగా నిర్ణయించారు. ఈ దిశలో పలు అంశాలను సమీక్షించారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) మరియు ఆలయ సాంకేతిక సభ్యుల కమిటీతో సంప్రదించి దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం ప్రత్యేక ర్యాంప్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ఒడిశా వంతెన నిర్మాణ కార్పొరేషను వర్గాలకు అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు ఆద్యంతాలు ఓబీసీసీకి అవసరమైన అన్ని సహాయ సహకారాలను ఆలయ యంత్రాంగం అందజేస్తుందని సీఏవో డాక్టర్ అరవింద కుమార్ పాఢి హామీ ఇచ్చారు.

కొరాపుట్ పరబ్ ఏర్పాట్ల పర్యవేక్షణ



పరబ్ వేదిక వద్ద కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘురాం

కొరాపుట్: రాష్ట్రస్థాయి కొరాపుట్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవం పరబ్-24 ముగింపు ఉత్సవాల ఏర్పాట్లని కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పరబ్ గ్రౌండ్స్‌లో నిర్మాణాల శైలి పరిశీలించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే పరబ్ ముగింపు వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.

గంజాయి సాగుపై ఉక్కుపాదం



నువాగడలో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు



నదిగుడి ప్రాంతంలో గంజాయి మొక్కలను తగలబెడుతున్న దృశ్యం

రాయగడ: అటవీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న గంజాయి సాగుపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. గత కొద్ది రోజులుగా విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయిని పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు దాడులను నిర్వహించి నాశనం చేస్తున్నారు. జిల్లాలోని పద్మపూర్‌లో ఉన్న నదిగుడి, నువాగడలో బుధవారం ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో 21 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతుందని సమాచారం అందుకున్న పోలీసులు, ఈ మేరకు దాడులను నిర్వహించామని జిల్లా పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

అయ్యప్ప స్వాముల సందడి



ఇరుముడుల కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న మహిళ

రాయగడ: స్థానిక ఉమాశంకర్ లైన్‌లో గల అయ్యప్ప స్వామి మందిరంలో గురువారం ఇరుముడుల సందడి కనిపించింది. స్వామి మండల దీక్ష పూర్తవ్వడంతో అయ్యప్ప భక్తులు ఇరుముడుల కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుస్వామి జగన్నాథరావు నేతృత్వంలో భక్తులకు ఇరుముడులు కట్టారు. స్వాములు శబరిమల బయలుదేరారు. స్వాముల బంధువులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ మొదటి గేటు వద్ద గురువారం స్థానిక పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్స్‌లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలకు సబంధించిన అన్ని పత్రాలు ఉండాలన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భారీ సాలగ్రామ శిల బహుమానం



పూరీ శ్రీ జగన్నాథునికి కళింగ వైశ్య సంఘం భారీ సాలగ్రామ శిలని బహుమానంగా ప్రదానం చేసింది. గండకీ నది నుంచి తీసుకువచ్చిన శిలగా దాతలు పేర్కొన్నారు. దీని బరువు సుమారు 30 కిలోలు ఉందన్నారు. ఈ శిలని శ్రీ మందిరం అధికార వర్గానికి అందజేశారు.

- భువనేశ్వర్

కొత్త సంవత్సరంలో రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు

భువనేశ్వర్: కొత్త సంవత్సరంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడు నియమితులు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి జయ పాల్ సింగ్ తోమర్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నెలలో బీజేపీ రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుని ఎన్నిక జరుగతుందన్నారు. ప్రజాస్వామ్య విధానాలతో ఈ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి ఎన్నిక ముగించి తదుపరి రాష్ట్ర స్థాయి ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తోమర్ వివరించారు. ప్రస్తుతం మన్‌మోహన్ సామల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2023 సంవత్సరంలో ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు.

నల్లనయ్యా.. ఆరగించవయ్యా





వ్యంజన ద్వాదశి పురస్కరించుకుని శ్రీ కృష్ణ భగవానునికి 805 రకాల భారీ నైవేద్యం సమర్పించారు. పూరీ మాతా మఠంలో పూజలందుకుంటున్న శ్రీ కృష్ణునికి భక్తులు ఈ తరహాలో రుచికరమైన వంటకాలతో నైవేద్యం సమర్పించారు.

- భువనేశ్వర్

క్లుప్తంగా

జిల్లాలో పెరుగుతున్న చలి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని మోహన నియోజికవర్గంలో చంద్రగిరి, మహేంద్రగడ, నువాగడ, రాయఘడ, పర్లాకిమిడిలో చలి రెండురోజులుగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పగటి పూట 19 సెంటీగ్రేడ్ డిగ్రీలు ఉండగా సాయంత్రం 16 డిగ్రీలకు పడిపోయింది. మోహనాలో పగటి పూట 24 డిగ్రీలు, సాయంత్రం 13 డిగ్రీలకు పడిపోయింది. డిసెంబరు 25 వరకూ చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ నిపుణులు, ఐఎండీ మాజీ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్ర సాహు తెలిపారు.

మోహన మహోత్సవాలు ప్రారంభం



మోహన మహోత్సవాల్లో మాట్లాడుతున్న డీఎఫ్ఓ ఆనంద్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన నియోజకవర్గం మోహన మినీ స్టేడియంలో గురువారం సాయంత్రం మోహన మహోత్సవాలు–2024ను ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. డీఎఫ్ఓ ఎస్.ఆనంద్ మాట్లాడుతూ గజపతి జిల్లాలో మోహనా బ్లాక్ ప్రకృతి సౌందర్యాలకు నెలవు అని అన్నారు. విభిన్న సంస్కృతి, భాషల మేళవింపు కనిపిస్తుందన్నారు.

గాయపడిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి

నందిగాం: మండలంలోని పెద్దలవునిపల్లి జాతీయ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కాపుతెంబూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తుంగాన చైతన్య(32) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న నందిగాం ఎంపీడీఓ ఆఫీసులో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అధికారులు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన చైతన్య తిరిగి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామమైన పాత్రునివలస వెళుతుండగా పెద్దలవునిపల్లి సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. చైతన్యకు భార్య అమృత, మూడేళ్ల కుమార్తె హన్షిత ఉన్నారు. అమృత పలాస మండలం బంటుకొత్తూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చైతన్య తండ్రి కేశవుడు కొత్తగ్రహారం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాగా తల్లి కృష్ణవేణి గృహిణి. భార్య అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి



అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమ

ఇచ్ఛాపురం : పట్టణంలోని చక్రపాణి వీధికి చెందిన లక్ష్మిరెడ్డి రాజు(33) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఈయనకు తల్లి రమ, భార్య రోజా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు లేకపోవడంతో గురువారం తల్లి రమ కుమారుడికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది.

మునిగుడలో.. సమితి స్థాయి చైతీ ఉత్సవాలు

జిల్లాలోని మునిగుడలో సమితి స్థాయి చైతీ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసీల సంప్రదాయం వారి కళా,సంస్కృతులకు అద్దం పట్టేవి చైతీ ఉత్సవాలని అన్నారు. ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు కాళీరాం మాఝి, ఆ పార్టీ సీనియర్ నాయకులు గొవింద్ జైన్ తదితర ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రాయగడ



ఉత్సవాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే హికక, కాళీరాం తదితరులు



ప్రచారరథం



కళాకారులకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం



కలశ యాత్ర, మినీమారథాన్



సంబల్‌పూరి నృత్య ప్రదర్శన



స్టాల్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హికక



ఆదివాసీల దుస్తుల్లో విద్యార్థులు

సురక్షిత పరిసరాలు పటిష్ట పురోగతికి పునాది



పచ్చ జెండా ఊపి ఈఆర్ఎస్ఎస్ వాహన సేవల్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కల్పించే దిశలో ప్రభుత్వం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, సురక్షిత పరిసరాలు రాష్ట్ర సమగ్ర పురోగతికి బలమైన ఆధారమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. స్థానిక జంట నగరాల పోలీసు కమిషనరేటు కార్యాలయం ఆవరణలో ప్రత్యేక వాహన సేవల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంక్షిప్తంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా గౌరవ కవాతు స్వీకరించారు. అత్యవసర సహాయ మద్దతు వ్యవస్థ ఈఆర్ఎస్ఎస్ వాహన సేవల్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పచ్చ జెండా ఊపి 30 ఈఆర్ఎస్ఎస్ వాహనాల్ని సేవా రంగంలోకి ప్రవేశపెట్టారు. కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనరేటు పరిధిలో ఈ వాహన సేవలు అందుబాటులో ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ కల్యాణి సంఘ మిత్రాదేవి

రాయగడ: ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న ధాన్యం మండీలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేలా బజారు నియంత్రణ కమిటీ చర్యలు తీసుకుంది. ఈ మేరకు గురువారం ఆర్ఎంసీ కార్యాలయం ప్రాంగణంలో సబ్ కలెక్టర్ కల్యాణి సంఘ మిత్రాదేవి ప్రచార రథన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో గల రైతులు దళారులబారిన పడి తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అవగాహన కల్పించేలా ఈ చైతన్య రథాన్ని ప్రారంభించడం జరిగిందని సబ్ కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం ప్రతీ క్వింటా ధాన్యానికి రూ.2,300 మద్దతు ధరను ప్రకటించడంతోపాటు అదనంగా ఇన్‌పుట్ సబ్సిడీ కింద మరో రూ.800లను అందిస్తుందన్నారు. దీనిని రైతులు తెలుసుకుని సరాసరి మండీల వద్దకే వచ్చి ధాన్యం విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 13 ధాన్యం మండీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

శ్రామిక్ కాంగ్రెస్ విజయం



విజయోత్సవ ఊరేగింపులో శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు

భువనేశ్వర్: రైల్వే శాఖలో కార్మిక సంఘాల గుర్తింపు హోదాకు సంబంధించిన ఎన్నిక ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. ఈ ఎన్నికల్లో రెండు కార్మిక సంఘాలు పోటీపడ్డాయి. వీటిలో తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అగ్ర స్థానంలో నిలవగా, తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. 1,970 ఓట్ల ఆధిక్యతతో శ్రామిక్ కాంగ్రెస్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. శ్రామిక్ కాంగ్రెస్‌కు పోలింగ్ 47.38 శాతం నమోదు కాగా, శ్రామిక్ యూనియన్ పోలింగ్ 42.32 శాతానికి పరిమితమైంది. పోలైన ఓట్లలో 35 శాతం, సమగ్ర ఓట్లలో 30 శాతం లెక్క ప్రకారం రహస్య బ్యాలెట్ ఎన్నికలో శ్రామిక్ సంఘాలకు గుర్తింపు ప్రామాణికంగా పరిగణిస్తారు.

తూర్పు కోస్తా రైల్వే జోన్ వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఇరు పక్షాలు సాధించిన ఓట్లు వివరాలు ఇలా..

ప్రాంతం	శ్రామిక్ కాంగ్రెస్	శ్రామిక్ యూనియన్
మంచేశ్వర్	625	665
పోస్టలు	144	116
జోనల్ ప్రధాన కార్యాలయం	808	297
సంబలపూర్	2,399	2,357
ఖుర్దారోడ్	8,324	5,921
విశాఖపట్నం	6,161	7,131
మొత్తం	18,459	16,489

కేంద్రియ విద్యాలయం విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్రీయ బాల విజ్ఞాన ప్రదర్శనలో ద్వితీయ స్థానం

పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో కిట్ విశ్వవిద్యాలయంలో ఎస్.సి.ఈ.ఆర్.టీ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన రాష్ట్రీయ బాల విజ్ఞాన ప్రదర్శనలో గజపతి కేంద్రీయ విద్యాలయం ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీనిధి సాహు ద్వితీయ బహుమతి సాధించింది. ఫైనల్ రాష్ట్రీయ బాల విజ్ఞాన ప్రదర్శనలో ప్రథమ బహుమతిని కోరాపుట్ కేంద్రియ విద్యాలయం విద్యార్థి కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిని గజపతి కె.వి.క్యాంపస్ విద్యార్థి శ్రీనిధి సాహుకు పురస్కారం లభించింది. శ్రీనిధి సాహు విజయంపై గజపతి కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ రాష్ట్రీయ బాల విజ్ఞాన ప్రదర్శన ఆధ్వర్యంలో జరిగినట్టు అధికారులు తెలియజేశారు.



శ్రీనిధి సాహుకు బహుమతి అందజేస్తున్న అధికారులు

దుకాణాలు కేటాయించాలని వినతి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యాపారులు

జయపురం: జయపురం పాత బస్టాండ్‌లో ఎన్నో ఏళ్ల నుంచి వ్యాపారాలు చేసుకుంటున్నవారికి కొత్త బస్టాండ్‌లో దుకాణాలు కల్పించాలని జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌర్య రెడ్డిని వ్యాపారులు గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. తాము గత 40 ఏళ్లనుంచి పాత బస్టాండ్‌లో వార్తా పత్రికలు, పాన్, టీ, మిఠాయి తదితర దుకాణాలు నడుపుతూ వాటిపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం పాత బస్టాండ్‌ను కొత్త బస్టాండ్‌కు తరలించటం వలన వ్యాపారాలు కోల్పోయామన్నారు. తమ 14 మందికి కొత్త బస్టాండ్‌లో నిర్మించిన దుకాణాలు కేటాయించాలని కోరారు. స్టాల్స్ కోసం టెండర్ పిలిచినప్పుడు పాత బస్టాండ్‌లో ఉన్న 14 మందికి ప్రాధాన్యత కల్పిస్తామని సబ్‌కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. సబ్‌కలెక్టర్‌ను కలిసిన వారిలో వ్యాపారులు బృందావన మహంతి, మనోజ్ కుమార్ మిశ్ర, బిఘ్నరాజ్ పాణిగ్రహి, ఎం.రామారావు, హృషికేష్ బెహరా, శ్రీమంతిన దొర, శంకర బెహరా, బినోద్ పాడీ, ఎం.మల్లేశ్వరరావు, సుచిత్ర దొర, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న వన్యమృగాల చిత్రాలు



పులి కూన బొమ్మను గీస్తున్న చిత్రకారుడు శివరాం నాయక్



పులి కూన బొమ్మను గీస్తున్న చిత్రకారుడు శివరాం నాయక్

పర్లాకిమిడి: పట్టణ సుందరీకరణలో భాగంగా పర్లాకిమిడి పురపాలక సంఘం ఆధ్వర్యంలో అనేక అందమైన చిత్రాలను చిత్రకారులు వేస్తున్నారు. వీటిలో గిరిజన సంస్కృతి, వన్యమృగాల తైల వర్ణచిత్రాలు పాదచారులకు ఆకట్టుకుంటున్నాయి. వన్యమృగాలకు ఒకప్పుడు దుర్గమమైన గజపతికి ప్రస్తుత చిత్రాలు అద్దం పడుతున్నాయి. మోహనా బ్లాక్‌కు చెందిన చిత్రకారుడు శివరాం నాయక్ బృందం బొమ్మలు వేస్తూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు.

వ్యక్తి అరెస్ట్



నిందితుడు భీమ భూమియ

జయపురం: పాత గొడవల నేపథ్యంలో వృద్ధుడిపై ఓ వ్యక్తి దాడి జరపగా అతడిని జయపురం సదర్ పోలీసులు అరెస్టు గురువారం చేశారు. అరెస్టు అయిన వ్యక్తి జయపురం సమితి పుట్ర గ్రామం భీమ భూమియ అని జయపురం సదర్ పోలీసు ఇన్‌చార్జి అధికారి, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి వెల్లడించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి."పుట్ర కరణసాహిలో విమళ గౌడకు భీమ భూమియకు నీలగిరి తోట విషయంపై తగాదా ఏర్పడింది. ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం గౌడ పశువులను మేపేందుకు తీసుకువెళ్లాడు. ఆ సమయంలో భీమ భూమియ అక్కడకు వెళ్లి విమళ గౌడను దుర్భాషలాడాడు. నీలగిరి కర్రతో గౌడపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాడని ఆరోపణ. గాయపడిన గౌడను ఆ ప్రాంతం వారు జయపురం జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. గౌడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయపురం సదర్ పోలీస్ పరిధి అంబాగుడ పోలీసులు కేసు నమోదు చేశారు. అంబాగుడ ఏఎస్ఐ మనువ బిడిక కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుని బుధవారం అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారి దొలాయి వెల్లడించారు. నిందితుడిని గురువారం కోర్టులో హాజరిచారు. బైల్ రాకపోవడంతో అతడిని జైలుకు పంపినట్లు తెలిపారు.

ఉత్సాహంగా పడవ పందాలు



వేదికపై అతిథులు



జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్



పోటీ పడుతున్న పడవలు



పందాలు చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



విజేతలకు అభినందనలు తెలుతుపున్న కలెక్టర్ ఆశిష్

మాల్యవంత్ ఉత్సవాల్లో చివరి ఘట్టమైన పడవ పందాలు ఉత్సాహంగా జరిగాయి. మల్కన్‌గిరి సమితి సత్తిగూడ జలాశయంలో నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ పోటీలు ప్రారంభించారు. మొత్తం పది జట్లు పాల్గొన్నాయి.

మల్కన్‌గిరి

క్లుప్తంగా

హాస్టల్స్ మరమ్మతులకు నిధులు మంజూరు

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని 11 సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో రూ.1.89కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మేజర్ పనుల నిమిత్తం రూ.150.81లక్షలు, మైనర్ మరమ్మతుల నిమిత్తం రూ.37.60లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. నాణ్యతలో రాజీలేకుండా ప్రభుత్వ సూచనలను పాటించి పనులను చేపట్టేలా ఏపీఈడబ్ల్యూడీసీ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్ష అభియాన్, గిరిజన సంక్షేమశాఖ అధికారులు కార్యనిర్వాహక ఏజెన్సీలను గుర్తించాలని ఆదేశించారు. పనులు చేపట్టక ముందు, తరువాత ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పనులకు సంబంధించిన పూర్తి బాధ్యతలను సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

● కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శాస్త్రి



అథ్లెటిక్స్‌కు క్రీడాజ్యోతిని అందిస్తున్న ప్రిన్సిపాల్ శర్మ

విజయనగరం రూరల్: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణిస్తే ఉజ్వలమైన భవిష్యత్తును పొందగలరని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పాఠశాల 63 అథ్లెటిక్స్ మీట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈక్రీడలు డిసెంబర్ 21వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. చాణక్య, గజపతి,గుప్త,మొఘల్ అనే నాలుగు హౌస్‌లకు చెందిన 150మంది అథ్లెటిక్స్ 11 ట్రాక్స్‌లలో ఏడు ఫీల్డ్ ఈవెంట్లలో ఆసక్తిగా పోటీపడుతున్నారని, గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 21న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు



ఆటో ప్రమాదంలో గాయపడిన వెంకటి

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామ సమీపంలో రహదారి పక్కన ఉన్న చెట్టును ఆటో ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై బాధితుడి బంధువులు చెప్పిన వివరాల ప్రకారం బలిజిపేట మండలం వంతరాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కె.వెంకటి తన ఆటోలో చింతాడ నుంచి వంతరాం గ్రామానికి వెళ్తుండగా రహదారిలో తీవ్రమైన మంచుకారణంగా దారి కనిపించక పక్కనే ఉన్న చెట్టును ఆటోతో ఢీకొన్నాడు. దీంతో వెంకటి తలకు తీవ్ర గాయం కాగా 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం నూరుస్తుండగా వ్యక్తికి గాయాలు

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ, బోరింగువలస గ్రామానికి చెందిన ఓవ్యక్తి ధాన్యం నూర్పుడు యంత్రం వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కుడిచేయి నుజ్జునుజ్జయింది. గ్రామానికి చెందిన తాడంగి కృష్ణ గురువారం ఉదయం గ్రామం సమీపంలోని పంటపొలాల్లో నూర్పుడు యంత్రంతో ధాన్యం నూర్చే పనులు జరిపిస్తున్నాడు. ప్రమాదవశాత్తు యంత్రంలో అతని కుడిచెయ్యి పడడంతో నుజ్జునుజ్జయింది. గ్రామస్తులు హుటాహుటిన వైద్యచికిత్స నిమిత్తం పార్వతీపురంలో ఓ ఆస్పత్రికి తరలించారు.

సీఐలకు బదిలీ

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐగా వీఆర్‌లో ఉన్న డి.బంగారుపాపను నియమించారు. ఇప్పటివరకూ సైబర్‌సెల్‌లో పనిచేసిన ఎల్. అప్పలనాయుడును ఎస్.కోట సీఐగా బదిలీ చేశారు. ఎస్.కోటలో పనిచేస్తున్న కవిటి రవికుమార్‌ను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న సాకేటి శంకరరావును విజయనగరం డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అలాగే పార్వతీపురం మన్యం డీఎస్బీ–2లో పనిచేస్తున్న కె.మురళీధర్‌ను పార్వతీపురం టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న బి.శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల సర్కిల్‌కు, అదేవిధంగా శ్రీకాకుళం డీఎస్బీలో ఉన్న పి.సూర్యనారాయణను కాశీబుగ్గకు, కాశీబుగ్గలో పనిచేస్తున్న దాడి మోహనరావును శ్రీకాకుళం డీఎస్బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

● పూర్తయిన ఏర్పాట్లు



ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్(ఫైల్)

పార్వతీపురం: సాగునీటి వినియోగదారుల దారుల సంఘాల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో సాగునీటి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులను గత నెల 3వ వారంలో నిర్వహించారు. మిగిలిన ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రెండు విభాగాలుగా నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 14న ఉదయం సాగునీటి సంఘ సభ్యుల(ప్రాదేశిక సభ్యులు) ఎన్నిక ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.

ఎన్నిక ఇలా..

18ఏళ్లు నిండిన వారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి, పింఛన్ దారు పోటీకి అనర్హులు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు, పారితోషికాలు పొందేవారు అనర్హులు. ఎన్నికను మూడు విధాలుగా నిర్వహించనున్నారు. తొలుత అక్షరమాల ప్రకారం అభ్యర్థుల వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవం అవుతుందేమో చూస్తారు. లేకుంటే అభ్యర్థుల వరుస క్రమం ప్రకారం వేదిక పైకి అభ్యర్థిని పిలిచి చేతులు పైకి ఎత్తే విధానంలో ఎన్నిక జరుగుతుంది. ఎవరికి ఎక్కువ మద్దతు వస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. చేతులెత్తే విధానం వీలు పడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు వేసే రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఓటరు కార్డు, ఆధార్ కార్డు, ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

జిల్లాలో..

జిల్లాలో 22 భారీ నీటిపారుదల, 25 మధ్య తరహా, 166 చిన్నతరహా నీటి వనరులకు ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పలనాయుడు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వాలి

● ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌నాయక్ మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు విచారం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై కళాశాల యాజమాన్యం, జిల్లా యంత్రాంగంతో గురువారం ఆయన మాట్లాడారు. కళాశాలలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నడవడికపై యాజమాన్యాలు, నిర్వాహకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన సందర్భంలో కౌన్సెలింగ్ చేపట్టి విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు విద్యాసంస్థలు బాటలు వేయాలని సూచించారు. ప్రవీణ్ నాయక్ మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా కోరారు. ప్రవీణ్ నాయక్ కుటుంబానికి కమిషన్ చైర్మన్ సంతాపం తెలియజేశారు.

విద్యుత్‌షాక్‌తో ఇటుకబట్టీ కార్మికుడి మృతి



అంజిబాబు మృతదేహం

మక్కువ: మండలంలోని శంబర, ఎస్.పెద్దవలస గ్రామాల సమీపంలోని ఇటుకబట్టీ వద్ద విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు కర్రి అంజిబాబు(25) గురువారం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువలోని యానాదివీధికి చెందిన మూడు కుటుంబాలు ఇటుకబట్టీకోసం, కొంతకాలం క్రితం శంబర, పెద్దవలస గ్రామాల సమీపంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం ఇటుకబట్టీ వద్ద ఉన్న ఇనుప పైపులో ఓపాము ప్రవేశించింది. పైపులో ఉన్న పామును దూరంగా వదిలేద్దామనుకున్న సమయంలో, ఆ పైపు విద్యుత్‌వైర్లకు తగలడంతో, అంజిబాబు విద్యుత్‌షాక్‌కు గురై గాయాల పాలయ్యాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే, శంబర పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యాధికారి కిరణ్‌కుమార్ నిర్ధారించారు. మృతునికి భార్య శైలు, కుమారుడు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● జిల్లా లీడ్ బ్యాంకు అధికారి జేఎల్ఎన్ మూర్తి



గ్రంథాలయాలకు పుస్తకాలను అందజేస్తున్న జిల్లా లీడ్ బ్యాంకు అధికారి జేఎల్ఎన్ మూర్తి

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాలపై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలని, ఎటువంటి సైబర్ మోసాలకు లోనవకూడదని పార్వతీపురం మన్య జిల్లా లీడ్ బ్యాంకు అధికారి జేఎల్ఎన్ మూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి అనేక విధాలుగా ఆశ చూపించి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయన్నారు. రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలందరికీ సైబర్ నేరాలపై అవగాహన నిమిత్తం జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు 6 రకాల పుస్తకాలను ఉచితంగా అందజేశామన్నారు. జిల్లాలోని మిగతా గ్రంథాలయాలకు ఈ పుస్తకాలను పోస్ట్ ద్వారా పంపించామని చెప్పారు. ప్రజలందరూ ఈ పుస్తకాలను చదివి సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, ఆర్థిక లావాదేవీల్లో జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ సిబ్బంది కె.మౌనిక పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుపై ఐటీడీఏ పీఓ ఆగ్రహం

● షోకాజ్ నోటీసు ఇవ్వాలని వైద్యాధికారులకు ఆదేశాలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

వీరఘట్టం: రెండు నెలలుగా పీహెచ్‌సీలో ఉన్న మందుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోతే ఎలా? అంటూ సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి వీరఘట్టం పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఫార్మాసిస్టును ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి మందులు ఉండే స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. మందుల వివరాలు సక్రమంగా లేకపోవడంపై ఫార్మాసిస్టును వివరణ కోరారు. పనిచేయడం చేతకాకపోతే మానేయండి తప్ప..మందుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మాసిస్టు సింహాచలానికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, బి.ప్రదీప్‌కుమార్‌లను ఆదేశించారు.అనంతరం పీహెచ్‌సీలోని ల్యాబ్, మరుగుదొడ్లు, పడక గదులను పరిశీలించారు. అయితే ప్రతినెలా ఆశా డే సమావేశం నిర్వహించేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పక్కనే ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఒక గదిని కేటాయించాలని డాక్టర్లు పీఓను కోరారు. దీనికి వెంటనే సంబంధిత హాస్టల్ అధికారులతో పీఓ ఫోన్‌లో మాట్లాడారు. సమావేశం కోసం ఒక గదిని ఇవ్వాలని ఆదేశించారు.అలాగే పక్కనే పాడుబడి ఉన్న మండల పరిషత్ కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. ఈ భవనం పాములకు ఆవాసంగా మారిందని గురువారం సాక్షిలో న్యూస్ వచ్చిందని, తాను ఆ వార్తను చదివానని పీఓ అన్నారు.ఈ భవనాన్ని పీహెచ్‌సీకి వాడుకలోకి వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం నడుకూరు సమీపంలో మంజూరైన పెట్రోల్ బంక్‌కు సమకూర్చిన స్థలాన్ని పీఓ పరిశీలించారు.

ఫారెస్ట్ స్క్వాడ్ తనిఖీలు

● ఇంటెలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్



అటవీశాఖ కేసులు పెడుతోందని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన గోపాల రాయుడుపేట గ్రామస్తులు(ఫైల్)



అడవికి పోడు దెబ్బ

సాక్షిలో వచ్చిన అడవికి పోడుదెబ్బ కథనం

బొబ్బిలిరూరల్: అడవిని ఆక్రమించి అటవీసంపదను కొల్లగొట్టి ఆనవాళ్లు లేకుండా చేస్తున్న వలస దారుల దురాగతాలపై సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి ఎట్టకేలకు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. అక్టోబరు 29వ తేదీన అడవికి పోడు దెబ్బ కథనంతో గోపాలరాయుడుపేట, బొడ్డవలస, మల్లమ్మపేట గ్రామాల పరిధిలో సుమారు 450 హెక్టార్లలో 200 ఎకరాల మేర ఆక్రమణలకు గురైన రిజర్వ్ ఫారెస్టుపై సాక్షిలో వచ్చిన కథనంపై ఇన్నాళ్లకు ఆశాఖ అధికారుల్లో చలనం వచ్చింది. దీనిపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తూ ఆక్రమణలపై సమూల సమాచారాన్ని సేకరిస్తోంది.ఆక్రమించిన భూముల వివరాలు, అక్కడ ఉన్న పోరులు, వారు సాగుచేస్తున్న పంటల వివరాలను, స్వరూపాన్ని తెలుసుకుంటోంది. ఈ మేరకు బుధవారం సంబంధిత అటవీ ప్రాంతంలో స్పెషల్ స్క్వాడ్ పర్యటించి ఏమేరకు ఆక్రమణలు జరిగాయన్న వాస్తవాలను కనిపెట్టే పనిలో పడింది.

అంత రహస్యమెందుకో?

అత్యంత రహస్యంగా ఈ పర్యటన ఎందుకు, ఎలా జరిగిందో అన్న అంశాలను అటవీశాఖాధికారులు సిబ్బంది బయటపెట్టడంలేదు. దీని వెనుకున్న కారణాలను విశ్లేషించి తీసుకోనున్న చర్యలపై బహిర్గతం చేయాల్సిన ఆశాఖ ఉదాసీనత,నిర్లక్ష్యంపై చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ అడవిని కాపాడుకుంటామంటూ వేడుకుంటున్న గ్రామస్తులపై ఆశాఖ. కేసులు పెడుతోందని, విలువైన వృక్షసంపద దోచుకుని వాణిజ్యపంటలకు కేంద్రంగా మారిన రిజర్వ్‌ఫారెస్టును రక్షించలేకపోయారని అటవీశాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా అడవితో ఉన్న అనుబంధాన్ని తెంచేస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రిజర్వ్ ఫారెస్టులో సెంటుభూమి కావాలన్న పార్లమెంటులోనే బిల్లు పెట్టాల్సిన ఆవశ్యకత ఉన్న నేపథ్యంలో ఇన్నాళ్లుగా వలసదారుల ఆక్రమణలపై కళ్లుమూసుకున్నట్లు నటిస్తున్నారని, ఇప్పుడు కూడా తూతూమంత్రంగానే చర్యలుంటాయా? అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్పెషల్ స్క్వాడ్ పర్యటనపై వివరాలను స్థానిక బీట్ అధికారి స్వప్నను అడగగా ఉన్నతాధికారులు ఇక్కడి విషయాలను బయటవారికి వెల్ల డించవద్దని ఆదేశించారని చెప్పారు.

తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

● కె.మీనాకుమారి, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్

● సాక్షి కథనంపై స్పందన



మాట్లాడుతున్న జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ కె.మీనాకుమారి

విజయనగరం అర్బన్: ధాన్యం ఏ స్థాయిలో తడిచినా కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ కె.మీనాకుమారి ప్రకటించారు. ఈ మేరకు గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన 'కూటమి ప్రభుత్వానికి పట్టని రైతన్న ఘోష' కథనంపై ఆమె స్పందించారు. ఇటీవల వచ్చిన ఫెంగల్ తుఫాన్ కారణంగా జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా తడిచిన ధాన్యం ఉంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యథావిధిగా ఆ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వివరించారు. తుఫాన్ ప్రభావం చూపిన ఆయా ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించామని, ఇంకా తెలియని రైతులు ఆందోళన చెందకుండా కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించాలని సూచించారు. తుఫాన్ కారణంగా జిల్లాలో తడిచిన పంట వివరాలు సేకరించి జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. తాజాగా వస్తున్న మరో తుఫాన్‌కు ముందుజాగ్రత్తల్లో భాగంగా రైతులకు ఇబ్బంది కలగకుండా టార్పాలిన్లను విస్తృతంగా సరఫరా చేసామని పేర్కొన్నారు. రైతుకు ధాన్యం రవాణాలో వాహన కొరత సమస్యలను పరిష్కరించేందుకు ఇటీవల జీపీఎస్ వ్యవస్థను రద్దు చేశామని తెలిపారు. ధాన్యం రవాణా ఏర్పాట్లు కూడా ప్రభుత్వం ద్వారా చేపట్టనున్నట్లు తెలియజేశారు. వర్షపాతం వివరాలను ముందుగానే తెలుసుకుని ధాన్యం ఎక్కడా తడిసిపోకుండా ఒక వారానికి సరిపడా గోనె సంచులు 7.5 లక్షల వరకు ఆర్ఎస్‌కేల వద్ద రైతులకు అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 502 ఆర్ఎస్‌కేలలో 443 కేంద్రాలలో చేపట్టిన కొనుగోలు ప్రక్రియలో గురువారం సాయంత్రం వరకు 21,143 మంది రైతుల నుంచి రూ.223 కోట్లతో 1,03,168 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలియజేశారు.

నేడు సీనియర్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక


విజయనగరం: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథ కుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎంపిక పోటీల్లో మొత్తం 10 కేటగిరీల బరువుల్లో క్రీడాకారులను ఎంపిక చేయనున్నామన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1984 జనవరి 1వ తేదీ నుంచి 2005 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారే అర్హులుగా పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని, అర్హత /ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మరిన్ని వివరాలకు బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు 99083 53698 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

● వెలగని సిగ్నల్ లైట్లు



సింహాచలం మేడ రోడ్డులో సిగ్నల్ లైట్లు



సింహాచలం మేడ నుంచి ధర్మపురి వెళ్లే రోడ్డులో..



విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో సింహాచలం మేడ, కలెక్టరేట్ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా సిగ్నల్ లైట్లు అవసరం. అయితే గతంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు వెలగకకుండా దర్శనమిస్తున్నాయి. సిగ్నల్ లైట్లు అలంకార ప్రాయంగా నిలవడంతో పలువురు వాహనదారులు వాటిని చూస్తూ వెలుగుతాయేమోనని తికమక పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్,విజయనగరం



కలెక్టరేట్ జంక్షన్‌లో వెలగని లైట్లు



సిగ్నల్ లైట్లు లేకపోవడంతో మూడు వైపుల నుంచి వాహనాలు

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

డెంకాడ: ప్రకృతి వ్యవసాయంతో పంటకు, పర్యావరణానికి కూడా ప్రయోజనం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని అమకాంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుగు నివారణా మందులు, భూసారం పెంపొందించుకునేందుకు వినియోగించే ఎరువులను రైతులే నేరుగా తయారు చేసుకోవచ్చన్నారు. ఒకేసారి బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు మంచి ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిండి కోటి, ఎన్ఎఫ్ఏ మెరిసి, మెంటార్ గౌరి, రైతులు పాల్గొన్నారు.

16 నుంచి అన్నదాత దివస్ వారోత్సవాలు

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని (ఈ నెల 23న) పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు అన్నదాత ఫెస్టివ్ వారోత్సవాలను ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్‌బీఐ అగ్రికల్ విభాగం అమరావతి సర్కిల్ డీజీఎం హేమ ప్రకటించారు. పట్టణంలోని ఎస్‌బీఐ ట్రైనింగ్ కళాశాల ప్రాంగణంలో వారోత్సవాల నిర్వహణపై రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వారోత్సవాల షెడ్యూల్‌ను ఎస్‌బీఐ జాతీయ స్థాయిలో నిర్వహించనుందని తెలిపారు. అనంతరం పలువురు రైతులకు రూ.65 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు.

సబ్‌జైలును సందర్శించిన జిల్లా జడ్జి



సబ్‌జైలును సందర్శించిన జిల్లా న్యాయమూర్తి

చీపురుపల్లి: పట్టణంలోని సబ్‌జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తితో పాటు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో కొనసాగుతున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్స్, పారా లీగల్ వలంటీర్లు నిర్వహిస్తున్న విధుల పట్ల ఆరా తీశారు. జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించడా నికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని,వాటిని సక్రమంగా కొనసాగించాలని సూచించారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయసహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమని తెలియజేశారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు న్యాయవాది లేకుండా ఉండకూడదని, అలాంటి వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సహాయ న్యాయవాదిని అందిస్తుందని తెలియజేశారు. జైల్లో అమలవుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భోజనాలను, స్టోర్ రూమ్‌లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత ఉన్నారు.

రెవెన్యూ సదస్సును అడ్డుకున్న రైతులు



ఫోటో: రెవెన్యూ సందస్సును అడ్డుకుంటున్న రైతులు

● అడంగల్‌లో పేర్లు నమోదు చేస్తామని హామీ ఇచ్చిన సిబ్బంది

కొత్తవలస: మండలంలోని చిన్నపాలెం గ్రామంలో రెవెన్యూ శాఖ అధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును రైతులు అడ్డుకున్నారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో 11 శివారు గ్రామాలు ఉన్నాయని, గ్రామంలో సుమారు 700 ఎకరాల భూమిని రైతులు ఎప్పటి నుంచో రిజిస్ట్రేషన్‌లు చేసుకుని సాగుచేస్తున్నా నేటికీ సంబంధిత రైతులకు హక్కులను రెవెన్యూ శాఖ కల్పించ లేదని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములకు సంబంధించి హక్కుల కోసం ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా కనీసం పట్టించుకోలేదని అలాంటప్పుడు ఈ రెవెన్యూ సదస్సులు ఎందుకని అధికారులను నిలదీశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమస్యను వివరించారు.సర్వే నిర్వహించి సాగులో ఉన్న రైతుల పేర్లను రికార్డులలో నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం సభను అధికారులు నిర్వహించారు. వివిధ రకాల భూసమస్యలపై 11 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్‌లు పప్పు హరి, కోట అప్పారావులు తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగంపల్లి గణేష్, సీపీఎం నాయకులు గాడి అప్పారావు, గొంప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.